# యువతా.. ఓటేయవా?!

- ఓటు నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపని దేశ యువత
- 18, 19 ఏండ్ల వారిలో నమోదు చేసుకున్నది 38 శాతమే
- తెలంగాణలోనే అత్యధికంగా 67 శాతం నమోదు

**ఎక్కువ మంది యువత ఓటర్లుగా నమోదైన రాష్ట్రాలు**

| రాష్ట్రం | శాతం |
|---|---|
| తెలంగాణ | 67 శాతం |
| జమ్ము కశ్మీర్ | 62 శాతం |
| హిమాచల్ ప్రదేశ్ | 60 శాతం |
| రాజస్థాన్ | 55 శాతం |
| ఛత్తీస్‌గఢ్ | 54 శాతం |

**అతి తక్కువ మంది యువత ఓటర్లుగా నమోదైన రాష్ట్రాలు**

| రాష్ట్రం | శాతం |
|---|---|
| బీహార్ | 17 శాతం |
| ఢిల్లీ | 21 శాతం |
| ఉత్తరప్రదేశ్ | 23 శాతం |
| మహారాష్ట్ర | 27 శాతం |
| అస్సాం | 32 శాతం |



న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: మన తలరాతను మార్చే నాయకులను ఎన్నుకునే వజ్రాయుధం ఓటు. 18 ఏండ్లు దాటిన పౌరులకు ఓటు ఒక హక్కు. అయితే, మన దేశంలో ఓటు వేసే వయసు వచ్చినప్పటికీ ఓటు హక్కు పొందడానికి మాత్రం యువత అంతగా ఆసక్తి చూపించడం లేదు. మన దేశంలో ప్రస్తుతం 18, 19 ఏండ్ల వయసు ఉన్న యువత 4.9 కోట్ల మంది ఉన్నారు. వీరందరికీ ఓటరుగా నమోదు చేసే వయసు వచ్చినప్పటికీ కేవలం 1.8 కోట్ల మంది మాత్రమే ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్నారు. అంటే, ఓటేసే వయసు వచ్చినప్పటికీ కేవలం 38 శాతం మంది మాత్రమే ఓటు హక్కు పొందారు. మన దేశంలో 1988 వరకు ఓటు వేయాలంటే కనీస వయసు 21 ఏండ్లు ఉండేది. కానీ, చట్టసభల సభ్యులను ఎన్నుకోవడంలో యువతను భాగం చేయాలనే ఆలోచనతో 1988లో రాజ్యాంగ సవరణ చేసి మరీ ఓటు హక్కు వయసును 21 ఏండ్ల నుంచి 18 ఏండ్లకు తగ్గించారు. కానీ, ఈ అవకాశాన్ని మాత్రం యువత ఉపయోగించుకోవడం లేదనేది తాజా లెక్కలను బట్టి తెలుస్తున్నది.

**నమోదులో తెలంగాణనే టాప్**

దేశంలో 18, 19 ఏండ్ల యువత ఎక్కువగా ఓటర్లుగా నమోదైన రాష్ట్రాల్లో తెలంగాణనే మొదటి స్థానంలో ఉంది. తెలంగాణలో 18, 19 ఏండ్ల వయసు వారు 12 లక్షల మంది ఉండగా దాదాపు 8 లక్షల మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. అంటే 66.7 శాతం తెలంగాణ యువత ఓటును హక్కుగా పొందారు. తర్వాత జమ్ము కశ్మీర్‌లో 62 శాతం, హిమాచల్ ప్రదేశ్‌లో 60 శాతం మంది 18,19 ఏండ్ల వయసు యువత ఓటరు జాబితాలో చేరారు. ఇక ఉత్తరప్రదేశ్‌లో కేవలం 23 శాతం, మహారాష్ట్రలో 27 శాతం మంది మాత్రమే ఓటు హక్కు పొందారు. అత్యల్పంగా బీహార్‌లో ఓటు హక్కు వయసు వచ్చినా నమోదు చేసుకున్నది కేవలం 17 శాతం మంది మాత్రమే. బీహార్‌లో 18, 19 ఏండ్ల వయసు వారు 54 లక్షల మంది ఉంటే కేవలం 9.3 లక్షల మంది మాత్రమే ఓటరు జాబితాలో ఉన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోనూ కేవలం 21 శాతం మందే నమోదు చేసుకున్నారు.

---

## కేజ్రీవాల్‌ను ఇరికించినందుకే మాగుంటకు టికెట్

**బీజేపీ క్విడ్ ప్రోకో కుట్రలు!**
**ఆప్ ఎంపీ సంజయ్ ఆరోపణ**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్‌ను ఇరికించేందుకు బీజేపీ నాయకత్వం కుట్రలు చేసిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. బెయిల్‌పై విడుదలైన ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ కేసులో నిందితులతో బీజేపీ క్విడ్ ప్రోకోకు పాల్పడిందని అన్నారు. అందులో భాగంగానే ఏపీలోని ఒంగోలు నుంచి మాగుంట శ్రీనివాసుల రెడ్డికి బీజేపీ మిత్రపక్షం టీడీపీ నుంచి లోక్‌సభ టికెట్ వచ్చిందని ఆరోపించారు.

**ఎన్నికల సంఘం ఏమైనా బీజేపీ అనుబంధ సంస్థా? :ఆతిశీ**

కేంద్ర ఎన్నికల సంఘం తనకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై ఢిల్లీ మంత్రి, ఆప్ సీనియర్ నేత ఆతిశీ మండిపడ్డారు. ఈడీ ఏమైనా అధికార పార్టీ బీజేపీ అనుబంధ సంస్థా? అని ప్రశ్నించారు. తనను బీజేపీలో చేరాలని లేదా ఈడీ చేతిలో అరెస్టు అయ్యేందుకు సిద్ధంగా ఉండాలంటూ ఆ పార్టీ నేతలు తనను బెదిరించారని అతిశీ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై బీజేపీ ఫిర్యాదుపై స్పందించిన ఎన్నికల సంఘం గురువారం నోటీసులు ఇచ్చింది.

---

# జంప్ జిలానీలకే టికెట్!


- బీజేపీ ప్రకటించిన అభ్యర్థుల్లో 28 శాతం వాళ్లే
- అత్యధికంగా కాంగ్రెస్ నుంచి 37 మంది వలస
- యూపీలో 20 మంది జంపింగ్ నేతలకు టికెట్
- కొత్తగా వచ్చినవారికి టికెట్లివ్వడంపై కార్యకర్తల ఫైర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ ఇప్పటివరకూ ప్రకటించిన ప్రతీ నలుగురు అభ్యర్థుల్లో ఒకరు ఫిరాయింపుదారే. ఆ పార్టీ ఇప్పటివరకూ 417 మందికి టికెట్లను ప్రకటించింది. ఇందులో 116 మంది (28 శాతం) 2014 తరువాత ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి చేరి టికెట్ పొందినవారే. ఈ మేరకు ఇంగ్లిష్ న్యూస్ వెబ్‌సైట్ 'ది ప్రింట్' ఓ కథనంలో వెల్లడించింది.

**నిరసన సెగలు కూడా..**

బలహీనంగా ఉన్న రాష్ట్రాల్లో పార్టీని విస్తరించాలన్న ఉద్దేశంతో ఇతర పార్టీల్లోని కీలక నేతలను బీజేపీ చేర్చుకొని టికెట్లు కట్టబెడుతున్నది. దీంతో ఏండ్లుగా పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న వారికి అధిష్ఠానం వైఖరి ఆగ్రహాన్ని కలిగిస్తున్నది. ఫలితంగా మోదీ స్వరాష్ట్రం గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో కార్యకర్తలు అధిష్ఠానం తీరును వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలకు దిగుతున్నారు. అశోక్ తన్వార్ (సిర్సా), సీతా సొరేన్ (దుమ్కా), నవీన్ జిందాల్ (కురుక్షేత్ర) వంటి 33 మంది నేతలు ఒకటి ఇటీవలే పార్టీలో చేరారని, అలాంటి వాళ్లకు టికెట్లు కేటాయించడమేంటని పలువురు సీనియర్ బీజేపీ నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఏండ్లుగా పార్టీకి విధేయులుగా ఉన్నవారిని ఇది మోసగించడమేనని మండిపడుతున్నారు.






### లోక్‌సభ ఎన్నికలపై చైనా జోక్యం!

- ఏఐతో దుష్ప్రచారం
- మైక్రోసాఫ్ట్ హెచ్చరిక



న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: భారత్‌లో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు చైనా కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత కంటెంట్‌ను వినియోగించే అవకాశం ఉన్నదని మైక్రోసాఫ్ట్ శుక్రవారం విడుదల చేసిన ఓ నివేదికలో హెచ్చరించింది. భారత్‌తోపాటు అమెరికా, దక్షిణ కొరియా ఎన్నికలపై కూడా ప్రయోగించొచ్చని తెలిపింది. అయితే అలాంటి కంటెంట్ ఎన్నికల ఫలితాలపై చూపే ప్రభావం తక్కువగా ఉన్నప్పటికీ, అటువంటి మీమ్‌లు, ఆడియోలు, వీడియోలను చైనా కొనసాగిస్తుందని అభిప్రాయపడింది. చైనా ఇప్పటికే ఈ ఏడాది జనవరిలో తైవాన్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో కూడా ఏఐ ఆధారిత తప్పుడు కంటెంట్‌ను వ్యాప్తి చేయించిందని తెలిపింది. ఈ విధంగా విదేశీ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ఒక ప్రభుత్వ సంస్థ ఏఐ కంటెంట్‌ను వినియోగించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నది.

---

# పీఎంలలోనూ దక్షిణాదిపై వివక్షే!

## మొత్తం 15 మందిలో సౌత్ నుంచి ఇద్దరే
## అత్యధికంగా యూపీ నుంచి ఏడుగురు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): 76 ఏండ్ల స్వతంత్ర భారతావనిలో ఇప్పటివరకూ 15 మంది ప్రధానులుగా పనిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ అత్యధికంగా 16 సంవత్సరాల 286 రోజులపాటు ప్రధానిగా సేవ లందించగా, గుల్జారీలాల్ నందా అత్యల్పంగా 26 రోజులపాటు రెండు దఫాల్లో తాత్కాలిక ప్రధానిగా కొనసాగారు. 29 రాష్ట్రాల్లో కేవలం 6 రాష్ట్రాల నుంచే ప్రధానులు ఎన్నిక కావడం గమనార్హం. మొత్తంగా ఉత్తరాది నుంచి 13 మంది పీఎంలుగా పనిచేయగా, దక్షిణాది నుంచి కేవలం ఇద్దరే ప్రధానులుగా ఎన్నికయ్యారు.

**ఏ రాష్ట్రం నుంచి ఎంత మంది ప్రధానులు?**

| రాష్ట్రం | ప్రధానులు |
|---|---|
| ఉత్తరప్రదేశ్ – 7 | జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి, విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్, చంద్రశేఖర్, చరణ్‌సింగ్ |
| పంజాబ్-3 | మన్మోహన్ సింగ్, గుల్జారీలాల్ నందా, ఐకే గుజ్రాల్ |
| గుజరాత్-2 | నరేంద్ర మోదీ, మొరార్జీ దేశాయ్ |
| తెలంగాణ-1 | పీవీ నరసింహారావు |
| మధ్యప్రదేశ్-1 | వాజ్‌పేయీ |
| కర్ణాటక-1 | హెచ్‌డీ దేవెగౌడ |

ఇందిరాగాంధీ (కాంగ్రెస్) 15 ఏండ్ల 350 రోజులు
మన్మోహన్‌సింగ్ (కాంగ్రెస్) 10 ఏండ్ల 4 రోజులు
నరేంద్రమోదీ (బీజేపీ) 9 ఏండ్ల 315 రోజులు




జవహర్‌లాల్ నెహ్రూ (కాంగ్రెస్) 16 ఏండ్ల 286 రోజులు
వాజ్‌పేయీ (బీజేపీ) 6 ఏండ్ల 80 రోజులు

| ప్రధాని | కాలం |
|---|---|
| రాజీవ్‌గాంధీ (కాంగ్రెస్) | ఐదేండ్ల 32 రోజులు |
| పీవీ నరసింహారావు (కాంగ్రెస్) | నాలుగేండ్ల 330 రోజులు |
| మొరార్జీదేశాయ్ (జనతాపార్టీ) | రెండేండ్ల 126 రోజులు |
| లాల్‌బహదూర్‌శాస్త్రి (కాంగ్రెస్) | ఏడాది మీద 216 రోజులు |
| విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ (జనతాదళ్) | 343 రోజులు |
| ఐకే గుజ్రాల్ (జనతాదళ్) | 332 రోజులు |
| హెచ్‌డీ దేవెగౌడ (జనతాదళ్) | 324 రోజులు |
| చంద్రశేఖర్ (సమాజ్‌వాదీ జనతాపార్టీ) | 223 రోజులు |
| చరణ్‌సింగ్ (జనతాపార్టీ-సెక్యులర్) | 170 రోజులు |
| గుల్జారీలాల్ నందా (కాంగ్రెస్) | 26 రోజులు |

ఉత్తరాది నుంచి ప్రధానులు **13**
దక్షిణాది నుంచి ప్రధానులు **2**

**ఏ పార్టీ నుంచి ఎంతమంది ప్రధానులు? ఎంత కాలం?**

| పార్టీ పేరు | ప్రధానుల సంఖ్య | పనిచేసిన కాలం |
|---|---|---|
| కాంగ్రెస్ | 7 | 54 ఏండ్ల 123 రోజులు |
| బీజేపీ | 2 | 16 ఏండ్ల 25 రోజులు |
| జనతాదళ్ | 3 | రెండేండ్ల 269 రోజులు |
| జనతాపార్టీ | 1 | రెండేండ్ల 126 రోజులు |
| సమాజ్‌వాదీ జనతా పార్టీ | 1 | 223 రోజులు |
| జనతాపార్టీ (సెక్యులర్) | 1 | 170 రోజులు |

---

## తెలుగు వ్యక్తిని హత్యచేసిన అమెరికన్‌కు మరణశిక్ష అమలు

హ్యూస్టన్: అమెరికాలోని ఒక్లహోమా రాష్ట్రంలో 2002లో తెలుగు యువకుడు సహా ఇద్దరు వ్యక్తులను హత్యచేసిన 41 ఏళ్ల దోషికి గురువారం మరణశిక్ష అమలు చేశారు. ఓ వ్యక్తికి మరణశిక్ష విధించడం ఒక్లహోమాలో ఈ ఏడాది ఇదే తొలిసారి. మెక్అలెస్టర్ పట్టణంలోని ఒక్లహోమా రాష్ట్ర జైలులో దోషి మైఖేల్ డెవేన్ స్మిత్‌కు గురువారం ప్రాణాంతకమైన ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా మరణశిక్ష అమలు చేశారు. స్టోర్ క్లర్క్ అయిన 24 ఏండ్ల తెలుగు యువకుడు శరత్ పుల్లూరు, 40 ఏండ్ల జానెట్ మూర్‌ను 22 ఫిబ్రవరి 2002లో వేర్వేరు ఘటనల్లో హత్యచేసిన కేసులో స్మిత్ శిక్ష అనుభవిస్తున్నాడు. స్మిత్ మరణం నిర్ధారణ అయిన తర్వాత ఒక్లహోమా అటార్నీ జనరల్ జెంట్నెర్ డ్రమండ్ ఓ స్టేట్‌మెంట్ విడుదల చేస్తూ స్మిత్‌కు మరణశిక్ష అమలుచేయడం ద్వారా 22 ఏండ్ల సుదీర్ఘకాలం తర్వాత బాధిత కుటుంబాలకు న్యాయం జరిగినట్టు పేర్కొన్నారు.


శరత్

## శోమా కాంతి సేన్‌కు బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ: మహిళా హక్కుల కార్యకర్త శోమా కాంతి సేన్‌కు ఎల్గార్ పరిషద్ కేసులో సుప్రీంకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ సమయంలో ఆమె మహారాష్ట్ర విడిచి వెళ్లరాదని చెప్పింది. కేవలం ఒక మొబైల్ ఫోన్ మాత్రమే వాడాలని..ఫోన్ నంబర్ దర్యాప్తు అధికారికి ఇవ్వాలని సేన్‌ను కోర్టు ఆదేశించింది. ఫోన్‌లో జీపీఎస్‌ను ఎప్పుడూ ఆన్ చేసి ఉంచాలని సూచించింది. సేన్ ఎల్గార్ పరిషద్ కేసులో 2018 జూన్ 6న అరెస్ట్ అయ్యారు.

## లాలూ ప్రసాద్‌పై అరెస్టు వారెంట్

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ ఆర్జేడీ చీఫ్, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌కు గట్టి షాక్ తగిలింది. దాదాపు 30 ఏండ్ల క్రితం 'ఆయుధాల చట్టం' కింద నమోదైన కేసులో ఆయనపై మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లోని ఎంపీ/ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టు అరెస్టు వారెంట్ జారీచేసింది. 1995, ఆగస్టు 23 నుంచి 1997, మే 15 మధ్య ఫారం 16 కింద అక్రమంగా ఆయుధాల కొనుగోలు, సరఫరా జరిగిందన్న ఆరోపణలపై కేసు నమోదైంది.

---

# దేశంపై ప్రొస్టేట్ క్యాన్సర్ పడగ

- 2040 నాటికి కేసులు రెట్టింపు!
- తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లోనే అధికం
- మరణాలూ 85 శాతం పెరగొచ్చు
- లాన్సెట్ అధ్యయనం హెచ్చరిక



న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ప్రొస్టేట్ క్యాన్సర్ పడగ విప్పబోతున్నదని, కేసుల సంఖ్య, మరణాలు భారీగా పెరిగే ప్రమాదం పొంచి ఉన్నదని లాన్సెట్ కమిషన్ ఆన్ ప్రొస్టేట్ క్యాన్సర్ అధ్యయనంలో వెల్లడైంది. భారత్‌తో పాటు తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో ఎక్కువగా ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు పెరుగుతాయని ఈ అధ్యయనం అంచనా వేసింది. 2020 నుంచి 2040 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు రెట్టింపు అవుతాయని, ఈ వ్యాధి కారణంగా మరణాలు కూడా 85 శాతం పెరిగే అవకాశం ఉందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం భారత్‌లో నమోదవుతున్న మొత్తం క్యాన్సర్ కేసుల్లో ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు దాదాపుగా మూడు శాతం వరకు ఉంటున్నాయి. ఇప్పుడు భారత్‌లో ఏడాదికి 33 వేల నుంచి 42 వేల ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులను గుర్తిస్తున్నారు. 2040 నాటికి భారత్‌లో ఏడాదికి 71 వేల మంది దీని బారిన పడవచ్చని ఈ అధ్యయనం అంచనా వేసింది.

**దేశంలో ఏడాదికి 18 వేల మరణాలు**

భారత్‌తో పాటు తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో ప్రొస్టేట్ క్యాన్సర్ బారిన పడ్డ వారిని గుర్తించడం ఆలస్యం అవుతుండటమే అసలు సవాల్‌గా మారింది. చాలామందిలో వ్యాధి ముదిరిన తర్వాతనే ప్రొస్టేట్ క్యాన్సర్‌ను గుర్తించడం వల్ల మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. భారత్‌లో ఎక్కువ మందిలో వ్యాధి తుది దశల్లో ఉన్నప్పుడు గుర్తించడం వల్ల 65 శాతం బాధితులు మరణిస్తున్నారని ఈ అధ్యయనంలో పాల్గొన్న డాక్టర్ వేదాంగ్ మూర్తి పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రొస్టేట్ క్యాన్సర్‌తో ఏడాదికి 18 వేల నుంచి 20 వేల మరణాలు సంభవిస్తున్నట్టు చెప్పారు. 60 ఏండ్లు దాటిన పురుషులకు క్రమం తప్పకుండా పరీక్షలు జరపడం ద్వారా వ్యాధిని వేగంగా గుర్తించి చికిత్స అందించవచ్చని ఆయన తెలిపారు. వయసు, జన్యుపరమైన కారణాలతో పాటు ధూమపానం, ఒబెసిటీ, సరైన ఆహారం తీసుకోకపోవడం, జీవనశైలి సమస్యల వల్ల ప్రొస్టేట్ క్యాన్సర్ బారిన పడే వారి సంఖ్య పెరుగుతున్నట్టు వెల్లడించారు.

**ప్రపంచవ్యాప్తంగా ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు(ఏడాదికి)**
2020లో - 14 లక్షలు
2040లో - 29 లక్షలు(అంచనా)

**ప్రపంచవ్యాప్తంగా మరణాలు(ఏడాదికి)**
2020లో - 3.75 లక్షలు
2040లో - 7 లక్షలు(అంచనా)

**భారత్‌లో ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు(ఏడాదికి)**
ప్రస్తుతం - 33,000 - 42,000
2040లో - 71,000(అంచనా)

---

## దేశ తొలి ప్రధాని నేతాజీ: కంగన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: దేశ తొలి ప్రధాని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంటూ సినీ నటి, బీజేపీ నాయకురాలు కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఓ టీవీ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కంగనా.. 'ముందు నేను ఒక విషయాన్ని స్పష్టం చేయాలనుకుంటున్నాను. మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతదేశ మొదటి ప్రధానమంత్రి సుభాష్ చంద్రబోస్ ఎక్కడికెళ్లారు?' అంటూ వ్యాఖ్యానించారు. కంగనా వ్యాఖ్యలను యాంకర్ సరిచేయడానికి ప్రయత్నిస్తూ.. 'భారతదేశ మొదటి ప్రధాని బోస్ కాదు' అని చెప్పగా.. మళ్లీ కంగనా బదులిస్తూ.. 'ఎందుకు? ఆయన(బోస్) ఎక్కడికెళ్లారు? ఆయనను ఎవరు అదృశ్యం చేశారు?' అంటూ ఎదురు ప్రశ్నలు వేశారు.

## పాక్ ఉగ్రవాదులు, ఖలిస్థానీల హత్యకు భారత్ ఆదేశాలు!

**'ది గార్డియన్' సంచలన కథనం.. ఖండించిన భారత్**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: విదేశాల్లోని ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్‌లో ముష్కరులను భారత ఇంటర్నేషనల్ నిఘా ఏజెన్సీ హత్యచేస్తున్నదని బ్రిటన్ పత్రిక ది గార్డియన్ సంచలన కథనాన్ని ప్రచురించింది. అలాగే ఖలిస్థానీలను కూడా టార్గెట్‌గా చేసుకున్నదని పేర్కొన్నది. కెనడాలో సిక్కు వేర్పాటువాదుల హత్యలపై ఆ దేశ ప్రధానితో పాటు అమెరికాలో కూడా భారత్‌పై బహిరంగంగానే విమర్శలు వచ్చాయని పేర్కొన్నది. 2020 నుంచి పాకిస్థాన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో 20 మంది మరణించారని వివరించింది. కాగా, దిగార్డియన్ కథనాన్ని భారత్ కొట్టివేసింది. ఇవి నిరాధార ఆరోపణలని పేర్కొన్నది.

## ఎన్నికల్లో సివిల్ సర్వెంట్ల పోటీపై పిల్ విచారణకు సుప్రీంకోర్టు నో

న్యూఢిల్లీ: సివిల్ సర్వెంట్లు తమ పదవులకు రాజీనామా చేసిన తర్వాత కానీ, పదవీ విరమణ పొందిన తర్వాత కానీ నిర్ణీత కాలంపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు పిటిషనర్‌కు అనుమతి ఇచ్చింది. దీని కోసం సరైన అధికార వ్యవస్థను ఆశ్రయించవచ్చునని తెలిపింది. మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో, సివిల్ సర్వెంట్లు పదవీ విరమణ లేదా రాజీనామా చేసిన వెంటనే ఏదైనా రాజకీయ పార్టీ ఇచ్చే టికెట్‌పై చట్ట సభలు లేదా శాసనసభ లేదా పార్లమెంటుకు పోటీ చేయడాన్ని నిరోధించే విధంగా ఎన్నికల కమిషన్‌కు, కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

---

## రామేశ్వరం కేఫ్ పేలుళ్ల కేసు.. ఎన్ఐఏ అదుపులో బీజేపీ కార్యకర్త

బెంగళూరు: బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో పేలుడు ఘటన దర్యాప్తులో మరో ముందడుగు పడింది. ఈ కేసులో ఇద్దరు అనుమానితులతో సంబంధాలున్న బీజేపీ కార్యకర్తను అదుపులోకి తీసుకున్నట్టు ఎన్ఐఏ వర్గాలు వెల్లడించాయి. కేసు దర్యాప్తులో భాగంగా గత వారం శివమొగ్గలో ఎన్ఐఏ దాడులు జరిపింది. ఓ మొబైల్ స్టోర్‌తో సహా ఇద్దరు అనుమానితుల ఇండ్లలో సోదాలు జరిపింది. మొబైల్ స్టోర్ ఉద్యోగులను విచారించగా బీజేపీ కార్యకర్త సాయిప్రసాద్ పేరు బయటకు వచ్చిందని ఎన్ఐఏ వర్గాలు శుక్రవారం తెలిపాయి. బీజేపీ కార్యకర్త అరెస్ట్ కావటంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఆ పార్టీ నాయకుడు దినేశ్ గుండూరావు ఎక్స్ వేదికగా బీజేపీని నిలదీశారు. మీ పార్టీ కార్యకర్త అరెస్ట్‌పై మీరేం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. పేలుళ్లలో బీజేపీ ప్రమేయం ఉన్నట్టు అర్థమవుతున్నదని ఆయన అన్నారు. మార్చి 1న బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో జరిగిన పేలుడులో పది మంది గాయపడ్డారు.

# బర్డ్ ఫ్లూ అలజడి

- అమెరికాలో ఆవుల్లో హెచ్5ఎన్1 వైరస్
- డెయిరీ ఫామ్ కార్మికుడికి పాజిటివ్
- మొదటిసారి పశువు నుంచి మనిషికి
- కొవిడ్ కంటే 100 రెట్లు ప్రాణాంతకం
- మరో మహమ్మారి ముప్పు: నిపుణులు



న్యూయార్క్, ఏప్రిల్ 5: కొవిడ్ సృష్టించిన విలయం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న మానవాళిపై మరో మహమ్మారి పంజా విసరబోతున్నదా ? కరోనాను మించి ప్రాణ నష్టం చేయబోతున్నదా ? అంటే అవుననే అంటున్నారు నిపుణులు. అయితే, ఈసారి కొత్తగా ఏ వైరస్ పుట్టుకు రావాల్సిన అవసరం లేదని, ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పక్షులు, కోళ్లలో వ్యాపిస్తున్న బర్డ్‌ఫ్లూ హెచ్5ఎన్1 రకం వైరస్.. మహమ్మారిగా మారి దాడి చేసే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అమెరికాలో ఆవుల మందల్లో హెచ్5ఎన్1 వైరస్ సోకుతున్నది. కాన్సాస్, న్యూమెక్సికో, టెక్సాస్, ఓహియో, ఇడాహో, మిషిగన్‌లో పాడి పశువులకు బర్డ్‌ఫ్లూ సోకినట్టు గుర్తించారు. పక్షుల ద్వారా పశువులకు వైరస్ సోకినట్టుగా ప్రాథమికంగా నిర్ధారించారు.

**డెయిరీఫామ్ కార్మికుడికి వైరస్**

టెక్సాస్‌లోని ఓ డెయిరీఫామ్‌లో పని చేసే కార్మికుడికి కూడా బర్డ్‌ఫ్లూ సోకినట్టు గుర్తించారు. వైరస్ సోకిన ఆవులను తాకడం వల్ల అతడు వైరస్ బారిన పడ్డట్టు భావిస్తున్నారు. పశువుల నుంచి మనిషికి బర్డ్‌ఫ్లూ సోకడం ఇదే మొదటిసారి. ఇంతకుముందు 2022లోనూ అమెరికాలోని కొలరాడోలో ఒక వ్యక్తికి వైరస్ సోకినప్పటికీ అతడికి కోళ్ల నుంచి సోకింది.

**మరణాల రేటు ఎక్కువ**

బర్డ్‌ఫ్లూని ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా అని పిలుస్తారు. ఇందులో అనేక వేరియంట్లు ఉన్నప్పటికీ హెచ్5ఎన్1, హెచ్7ఎన్9కు మాత్రమే మనుషులకు సోకే సామర్థ్యముంది. హెచ్5ఎన్1 వైరస్‌ను తొలిసారి 1996లో చైనాలోని పక్షుల్లో గుర్తించారు. ఆ తర్వాత ఏడాది హాంకాంగ్‌లో వైరస్ పక్షుల నుంచి మనుషులకు వ్యాపించింది. 18 మంది వైరస్ బారిన పడగా ఆరుగురు మరణించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 2003 నుంచి ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 887 మంది హెచ్5ఎన్1 బర్డ్‌ఫ్లూ బారిన పడగా 462 మంది మరణించారు. వైరస్ బారిన పడుతున్న ప్రతి 100 మందిలో 52 మంది మరణిస్తున్నట్టు లెక్కలు చెప్తున్నాయి. కొవిడ్‌లో మరణాల రేటు 0.1 శాతం మాత్రమే ఉన్నప్పటికీ లక్షలాది మందిని బలిగొన్నది. హెచ్5ఎన్1లో మరణాల రేటు 52 శాతం కాబట్టి ఇది కొవిడ్ కంటే 100 రెట్లు ప్రాణాంతకం కావొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




### అమెరికాలో భూకంపం

**రిక్టర్ స్కేల్‌పై 4.8 తీవ్రత నమోదు**

న్యూయార్క్, ఏప్రిల్ 5: అమెరికాలోని న్యూయార్క్ సిటీ రీజియన్‌లో శుక్రవారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 4.8 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయని అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) వెల్లడించింది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగలేదని ప్రాథమికంగా తెలుస్తున్నదని న్యూయార్క్ మేయర్ ప్రతినిధి పేర్కొన్నారు. న్యూయార్క్‌లో భూకంపాలు సంభవించడం అత్యంత అరుదు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో గాజా యుద్ధంపై భద్రతా మండలి సమావేశం జరుగుతుండగా, భూకంపం సంభవించడంతో సమావేశాన్ని కాసేపు వాయిదా వేశారు.

---

## రిజర్వేషన్ల పెంపు.. దేశవ్యాప్త కులగణన

### మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 5: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శుక్రవారం విడుదల చేసిన మ్యానిఫెస్టోలో హామీల వర్షం కురిపించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, రిజర్వేషన్ల 50 శాతం పరిమితి పెంపునకు రాజ్యాంగ సవరణ, దేశవ్యాప్తంగా కులగణన నిర్వహణ, అగ్నిపథ్ స్కీమ్ రద్దు తదితర హామీలు గుప్పించింది. ఈ మేరకు 'న్యాయ్ పత్ర' పేరిట శుక్రవారం మ్యానిఫెస్టో విడుదల చేసింది. జమ్ముకశ్మీర్, పుదుచ్చేరిలకు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా, ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తామని కాంగ్రెస్ పేర్కొన్నది. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ స్థాయిలో 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని, 2025 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రూ.25 లక్షల ఆరోగ్య బీమా సదుపాయం, మహాలక్ష్మీ పథకం కింద దేశంలోని పేద మహిళలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తామని పేర్కొన్నది. ఉపాధి హామీ పథకం కింద రోజుకు ఇచ్చే కూలీని రూ.400 చేస్తామని ప్రకటించింది.